# శ్రీ యనమల రామకృష్ణుడు

శ్రీ యనమల రామకృష్ణుడు పదవ శాసనసభ (1994-1999) స్పీకరుగా 1995వ సంవత్సరం జనవరి 12వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1999వ సంవత్సరం అక్టోబర్ 10వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు శ్రీ అప్పారావు, శ్రీమతి సరస్వతి దంపతులకు 1951వ సంవత్సరము మే 12వ తేదీ తూర్పు గోదావరి జిల్లా ఎ.వి. నగరం గ్రామంలో జన్మించారు. రాజమండ్రిలోని గవర్నమెంట్ కాలేజీ నుండి పట్టభద్రులైన తరువాత మధ్యప్రదేశ్‌లోని సాగర్ యూనివర్సిటీ నుండి ఎల్.ఎల్.బి. డిగ్రీని పొంది కొంత కాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసారు.

శ్రీ రామకృష్ణుడు 1983వ సంవత్సరములో ఏడవ శాసనసభకు, 1985వ సంవత్సరంలో ఎనిమిదవ శాసనసభకు, 1989వ సంవత్సరంలో తొమ్మిదవ శాసనసభకు, 1994వ సంవత్సరంలో పదవ శాసనసభకు, 1999వ సంవత్సరంలో పదకొండవ శాసనసభకు, 2004వ సంవత్సరంలో పన్నెండవ శాసనసభకు వరుసగా తుని నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వీరు 09-1-1983 నుండి 16-08-1984 వరకు తిరిగి 16-09-1984 నుండి 22-11-1984 వరకు శ్రీ ఎన్.టి. రామారావు మంత్రి వర్గంలో పురపాలన, పట్టణాభివృద్ధి సంస్థలు, పట్టణ నీటి సరఫరా, న్యాయస్థానాలు, మురికివాడల నిర్మూలన, శాసనసభ వ్యవహారాలు, గృహనిర్మాణ మంత్రిగా పనిచేశారు. 1983-1984 సంవత్సరములో వీరు సదుపాయాల కమిటీకి అధ్యక్షులుగా ఉన్నారు. 1985వ సంవత్సరములో శ్రీ ఎన్.టి. రామారావు మంత్రి వర్గంలో 09-03-1985 నుండి 11-07-1987 వరకు సహకార శాఖ మంత్రిగా పనిచేసారు. 1989-1990 మధ్యకాలంలో ప్రభుత్వ సంస్థల కమిటీకి అధ్యక్షులుగా, 1991-1992 మధ్యకాలంలో ప్రభుత్వ లెక్కల కమిటీకి అధ్యక్షులుగా పనిచేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సిఫారసులతో కూడిన నివేదికలను శాసనసభకు సమర్పించడం జరిగింది.

వీరు స్పీకరుగా ఉన్న సమయంలో దేశం మొత్తం మీద మన రాష్ట్రంలో మొదటి సారిగా నైతిక విలువల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా ఈయన హయాంలోనే శాసనసభ్యులు ప్రతి సంవత్సరం తమ ఆస్తుల వివరాలను స్పీకరుకు అందచేయాలనే నియమాన్ని రూపొందించారు. అలాగే వీరి హయాంలో శాసనసభ కార్యకలాపాలను టీవీలలో ప్రత్యక్ష ప్రసారం చేయడం ప్రారంభమైనది. వీరి హయాంలోనే మొదటి సారిగా అల్ప సంఖ్యాక వర్గముల సంక్షేమ కమిటిని ఏర్పాటు చేశారు.

శాసనసభ కమిటీల పనితీరును మెరుగుపరచడానికి ఆయన విశేషంగా కృషి చేశారు. శాసనసభా కమిటీలు చేసిన సిఫారసులను సాధారణంగా అమలు పరచవలసిందేనని, అయితే కొన్ని సందర్భాలలో ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించాల్సి వచ్చినప్పుడు అలా ఎందుకు వ్యవహరించవలసి వచ్చిందో శాసనసభకు తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందని నొక్కి వక్కాణించారు. శాసనసభకు ప్రాతినిధ్యం వహించే శాసనసభ కమిటీల నివేదికలపై తీసుకున్న చర్యల నివేదికను ప్రభుత్వం ఆ కమిటీ నివేదికను పంపిన తరువాత ఆరు నెలలలోగా శాసనసభకు సమర్పించవలసి ఉంటుందని **1998**, ఏప్రిల్ **28**వ తేదీన ఇచ్చిన రూలింగులో శ్రీ రామకృష్ణుడు స్పష్టం చేశారు.

వీరు స్పీకరుగా అనేక సదస్సులలో పాల్గొన్నారు. అమెరికా, కెనడా, యు.కె., ఫ్రాన్సు, బ్రెజిల్, చైనా, జపాన్, సింగపూర్, మారిషస్, ఇజ్రాయిల్, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ మొదలైన దేశాలలో పర్యటించి ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరును అధ్యయనం చేశారు.

**1999**వ సంవత్సరములో శాసనసభ్యునిగా ఎన్నికైన తరువాత శ్రీ చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో **11-10-1999** నుండి **14-05-2004** వరకు ఆర్థిక, ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపు, లాటరీలు మరియు శాసనసభ వ్యవహారాల మంత్రిగా సమర్ధవంతంగా పనిచేశారు.

**2004** సంవత్సరములో **12**వ శాసనసభ సభ్యుడైన శ్రీ రామకృష్ణుడు ప్రభుత్వ లెక్కల కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు.